క్లుప్తంగా

ఇంటింటా పోషణ సంబరాలు

రాయదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఇంటింటా పోషణ కార్యక్రమం ప్రారంభమైంది. ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పర్యవేక్షణలో బాలింతలు, గర్భిణీ స్త్రీల ఇంటింటికి వెళ్ళి పరిశీలించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 14 వరకు ఉంటుంది.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం '



బీజేపీలో చేరుతున్న యువకులు

మియాపూర్ : రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో యువకులు బీజేపీలో చేరారు. గత తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. ప్రసాద్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల స్నాతకోత్సవ వేడుకలు



మాదాపూర్ : మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం చిన్నారుల స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లాయర్ కేవీ పద్మజ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం చిన్నారులకు యూకేజీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు తమ నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం మయూరిడాన్స్ అకాడమి గురువు వైదేహిసుభాష్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు.

అలరించిన అచ్యుతానంద స్వరార్చన



మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అలరించిన స్వరార్చన

మాదాపూర్ : మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహిస్తున్న స్వరార్చనలో భాగంగా కొమండూరి అచ్యుతానంద్ స్వరార్చన ఆకట్టుకుంది. మృదంగం విద్వాన్ పలివెల విద్యాసాగర్, వయోలిన్ విద్వాన్ శశి భూషణ్, ఫ్లూట్ పోవూరి రేవాంస్‌కుమార్ అందించారు. సంకీర్తనార్చన చేసిన కళాకారులను శోభరాజు జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

మొండి బకాయిలను వసూలు చేస్తున్నాం

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల యాజమాన్యాలు పన్నులు చెల్లించడం లేదని, మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని 12 పరిశ్రమలు ఏళ్లుగా పన్నులు చెల్లించటం లేదు. దీంతో శనివారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ నుంచి రూ.8.27 లక్షల పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడతూ పన్నులు చెల్లించని పరిశ్రమలకు రెడ్ నోటీసులు అందించామన్నారు. గృహ, వాణిజ్య సముదాయ, పరిశ్రమల యజమానులు ఐదు రోజుల్లో పన్నులను చెల్లించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని కుడికుంట రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన ఓ కమర్షియల్ కంటెయినర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు 'సీఐఎస్ఓ' కౌన్సిల్

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



పాల్గొన్న పోలీసులు, ఇతర ఐటీ ప్రొఫెషనల్స్

రాయదుర్గం: సైబర్ నేరాల నియంత్రణకు 'సీఐఎస్ఓ' కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్, టీఎస్‌పీసీసీ సంయుక్తంగా సైబర్ భద్రతపై నాయకత్వ కార్యక్రమం పేరిట ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలను నియంత్రించేందుకు కంపెనీల చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్(సీఐఎస్ఓ)లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు(ఎల్ఈఓ) కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరస్తుల నుంచి వచ్చే బెదిరింపుల సమస్య పరిష్కారానికి నిరంతరం పోలీసులు ఉంటారన్నారు. కానీ సైబర్ నేరగాళ్ళందరూ వ్యవస్థీకృత పద్ధతిలో పనిచేస్తారని గుర్తు చేశారు. అందుకే పరిజ్ఞానం ఉన్న నిపుణులు పోలీసులతో చేతులు కలపాలని, సమాజ ప్రయోజనాల కోసం కలిపి పనిచేయాలని కోరారు. అమెరికా సైబర్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సలహాదారుగా పనిచేసిన స్టీవ్‌పగ్ పలు సైబర్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ అంశాలపై తన అభిప్రాయాలను వివరించారు. సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ క్రైమ్ కల్మేశ్వర్, డీసీపీలు శిల్పవల్లి, శ్రీనివాస రావు, సందీప్, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రితిరాజ్, హర్షవర్ధన్, దీప్తిపంత్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమెరికన్ సైబర్ నేషనల్ సెక్యూరిటీ సలహాదారు స్టీవ్‌పగ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శం

మియాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేడు దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ ఆధ్వర్యంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధించుకున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని గతంలో ఏ పార్టీ చేయలేని అభివృద్ధి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

సుదర్శన క్రియ ద్వారా పొగాకు వ్యసనానికి విముక్తి

గచ్చిబౌలి: సుదర్శన ప్రక్రియ ద్వారా పొగాకు వ్యసనానికి విముక్తి కలుగుతుందని, రాష్ట్రం నుంచి పొగాకును తరిమి కొట్టాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు పిలుపునిచ్చారు. శనివారం గచ్చిబౌలిలోని శ్రీమాతా ఆరోగ్యదామంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పొగాకు వాడకం-అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు క్విట్ టొబాకో పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ వకుళాభరణం మాట్లాడుతూ పొగాకు వాడకంతో దేశంలో ప్రతి ఏటా 13.5 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. పొగాకు వ్యసనం వల్ల మానవాళికి నష్టం వాటిల్లుతుందని, అనేక కుటుంబాలు చిద్రమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమన్వయ కర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

చిట్కుల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని 266, 267, 305, 309 సర్వే నంబర్లలో గల దేవుని మాన్యంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరమేశం మాట్లాడుతూ.. ఇళ్లలో నివసిస్తున్న వారిని బయటికి పంపించి ఐదు ఇళ్లను పూర్తిగా, మూడు ఇళ్లను పాక్షికంగా కూల్చివేశారు. ఎటువంటి ఆందోళనకు తావివ్వకుండా పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే దేవుని మాన్యంలోకి వచ్చిన ప్రహరీని కూడా వదిలిపెట్టకుండా అధికారులు కూల్చివేశారు. దేవుని మాన్యాన్ని స్వాధీనం చేసుకొని పరిరక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం శ్రీచైతన్య టెక్నోస్కూల్స్ పాఠశాలలు ఫియెస్టా పేరిట స్టేట్‌లెవల్ కాంపిటీషన్ కార్యక్రమాలను నిర్వహించింది. ముఖ్య అతిథిగా సినీనటుడు కిరణ్ అబ్బ వరం పాల్గొని ప్రసంగించాడు. చిన్నారులను విద్యార్థుల దశనుంచే అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు.

హెచ్‌సీయూలో 'కేంద్రం' దిష్టిబొమ్మ దహనం



హెచ్‌సీయూలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన దృశ్యం



హెచ్‌సీయూలో నిరసిస్తూ ర్యాలీ చేసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు, సభ్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రాత్రి హెచ్‌సీయూ క్యాంపస్‌లోని సౌత్ క్యాంపస్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి తమ నిరసనను తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీని లోక్‌సభనుంచి డిస్‌క్వాలిఫై చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, సభ్యులు, విద్యార్థులు తమ చేతుల్లో కాగడాలను పట్టుకొని నిరసన తెలుపుతూ భారీ ర్యాలీని నిర్వహిస్తూ కేంద్రం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం అధ్యక్షులు అమల్ పాల్గొన్నారు

వైద్య నిపుణుల కోసం ఏఐజీలో శిక్షణ కేంద్రం



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ అంతర్జాతీయ వైద్య నిపుణులకు ఉపకరించే కొలంజియోస్కోపీ ట్రెనింగ్ - ఎక్సలెన్స్ శిక్షణా కేంద్రాన్ని గచ్చిబౌలిలోని ఎఐజీ ఆసుపత్రిలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ''వైద్య నిపుణులకు అత్యుత్తమ శిక్షణను అందించడానికి ఏఐజీ కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగా కొలొంజియోస్కోపీ సంబంధించిన విభిన్న అంశాలపై వీలైనంత ఎక్కువ మంది వైద్యులకు శిక్షణ ఇవ్వడం తమ లక్ష్యంగా వెల్లడించారు. దీనితో పాటు ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణల కోసం వైద్య పరికరాల రంగంలో గ్లోబల్ లీడర్ బోస్టన్ సైంటిఫిక్‌తో కలిసి పనిచేయనున్నామన్నారు. కార్యక్రమంలో బోస్టన్ సైంటిఫిక్ ఎండోస్కోపీ ప్రెసిడెంట్ మైక్ జోన్స్, మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ మాధవన్‌లు పాల్గొని తమ ఒప్పంద విశేషాలను, వైద్య రంగానికి అందించనున్న సేవల్ని వివరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మియాపూర్ : క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్ స్పోర్ట్స్ మీట్ -2023 క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన కార్పొరేటర్లకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జోనల్ కమీషనర్ శంకరయ్యలు బహుమతులను అందజేశారు. షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో మొదటి స్థానం మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మహిళా విభాగంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు గెలుపొందారు. ఉప కమిషనర్లు వెంకన్న, సుదాంష్ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన కార్పొరేటర్లకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చెత్త పేరుకుపోవడంతో స్థానికుల ఆగ్రహం

రాయదుర్గం: నానక్‌రాంగూడలో చెత్తచెదారం పేరుకుపోయినా పట్టించుకునేనాథుడే కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నానక్‌రాంగూడలోని రేషన్‌షాపు గల్లీలోని అంతర్గతరోడ్డుపై చెత్తాచెదారం, వ్యర్థాలు భారీగా పేరుకపోతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ఈ విషయంలో పట్టించుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.



నానక్‌రాంగూడలోని రేషన్‌షాప్ గల్లీలో అంతర్గత రోడ్డుపై చెత్తాచెదారం

రేపు గీతంలో 'టెడ్‌ఎక్స్'

పటాన్‌చెరు టౌన్: రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయం టెడ్‌ఎక్స్‌కు సిద్ధమవుతోంది. ఈనెల 27న రివైండ్ ది మిలీనియం ఇతివృత్తంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తినిచ్చేలా నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు శని వారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రఖ్యాత భారతీయ చలనచిత్ర దర్శకుడు, నిర్మాత, నటుడు గౌతం వాసుదేవ్ మీనన్, ఫ్యాషన్ డిజైనర్, సస్టైన్కిర్ట్ వ్యవస్థాపకురాలు, ఏకమ్ లెర్నింగ్ సెంటర్ సహ వ్యవస్థాపకురాలు శిల్పారెడ్డి, ప్రసిద్ధ చిత్రకారుడు సజ్జాద్ షాహిద్, స్కిప్పి ఐస్ పాప్స్ వ్యవస్థాపక జంట రవి-అనుజాకక్రా, తెలుగు - ఆంగ్ల పాటల రచయిత, ఇండీ సంగీత కళాకారుడు నితీశ్ కొండపర్తి, ప్రముఖ భరతనాట్య నృత్యకారిణి సవిత శాస్త్రి ప్రసంగిస్తారని తెలిపారు.

గడపగడపకూ కాంగ్రెస్

జిన్నారం(పటాన్‌చెరు): గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా పార్టీ చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని మండల పార్టీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి అన్నారు. మండలంలోని అనంతారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రోత్సహించాలి

నేడు గచ్చిబౌలి స్టేడియంలో కిడ్స్ మారథాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీటీ ఉష

హఫీజ్‌పేట్ : పిల్లల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం లిటిల్ మిలీనియం కిడ్స్ మారథాన్ మంచి వేదిక కానుందని రాజ్యసభ సభ్యురాలు, ఇండియా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషా పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని డెక్కన సిరాయ్ గ్రాండ్ హోటల్‌లో లిటిల్ మిలీనియం ఆధ్వర్యంలో కిడ్స్ మారథాన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీటీ ఉషా, లిటిల్ మిలీనియం సంస్థ అధ్యక్షులు ఆర్.ఆనంద్ హాజరై మాట్లాడారు. పిల్లలపై వేధింపులు చాలా ముఖ్యమైన విషయమని, ఈ విషయంపై అవగాహన పెంచడంలో లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ ముందుకు వచ్చి కిడ్స్ మారథాన్ నిర్వహించడం సంతోషకరమన్నారు. మొట్టమొదటి సారిగా హైదరాబాద్ నగరంలో ఈ కిడ్స్ మారథాన్ నిర్వహిస్తున్నారని అన్నారు.

అప్పట్లో సాధన కొరకు ఎలాంటి వసతులు లేవు...

తాను ఆ రోజుల్లో ఒలంపిక్ పోటీలలో పాల్గొనడానికి ముందు రన్నింగ్ కోసం ఎలాంటి స్టేడియంలో సింథటిక్ ట్రాక్‌లు లేవన్నారు. శిక్షణ కోసం రైల్వే స్టేషన్, ఫుట్‌పాత్‌లపై, సముద్ర ఒడ్డున రన్నింగ్ సాధన చేసేదాన్ని అని తెలిపారు. ఇప్పుడు జిల్లాకు ఒక స్టేడియం, సింథటిక్ ట్రాక్ ఉన్నాయన్నారు. నేటి యువతకు మంచి శిక్షణలు అందించడానికి దేశ, విదేశాల కోచ్‌లు కూడా అందుబాటులో ఉన్నారని అన్నారు. కొంత మంది యువతకు తానే సొంతంగా శిక్షణ ఇస్తూ వంటచేసి ఆహారం అందించానన్నారు.

నిజాయితీ చాటుకున్న డ్రైవర్, కండక్టర్



ప్రయాణికురాలికి హ్యాండ్ బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మియాపూర్ : బస్సులో వదిలి వెళ్లిన బ్యాగును ప్రయాణికురాలికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు బస్సు డ్రైవర్. మియాపూర్‌లోని ఆర్టీసీ -2 డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి మియాపూర్‌కు వెళుతోంది. సికింద్రాబాద్‌లో ప్రయాణికురాలు దీపిక బస్సు ఎక్కి మూసాబ్‌పేట్‌లో దిగింది. ఈ క్రమంలో బస్సులోనే ఓ హ్యాండ్ బ్యాగును మర్చిపోయి వెళ్లింది. డిపోకు వచ్చిన తర్వాత కండక్టర్ నర్సింలు, డ్రైవర్ శ్రీనివాస్‌లు బ్యాగును పరిశీలించగా 22 గ్రాముల బంగారం, రూ.1300నగదును ఉన్నట్లు గుర్తించారు. డిపో మేనేజర్ కు సమాచారం, ప్రయాణికురాలు దీపికకు సమాచారం అందించారు. దీంతో ఆమె డిపోకు రావడంతో కండక్టర్, డ్రైవర్లు డిపో అధికారుల సమక్షంలో హ్యాండ్ బ్యాగును అందజేశారు. నిజాయితీని చాటుకున్న డ్రైవర్ శ్రీనివాస్, కండక్టర్ నర్సింలులను డిపో -2 మేనేజర్ అభినందించారు.

నిర్మాణ రంగం భారత్ గొప్పతనానికి ప్రతీక



వర్మ స్టీల్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న త్రిదండి చిన్న జీయర్‌స్వామి

మదాపూర్: నిర్మాణ రంగం భారత్ గొప్పతనానికి ప్రతీకగా నిలుస్తుందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత త్రిదండి చిన్న జీయర్ స్వామిజీ పేర్కొన్నారు. శనివారం మాదాపూర్‌లో వర్మ స్టీల్స్ కార్పొరేట్ ఆఫీస్, నూతన ఉత్పత్తులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ నిర్మాణ రంగంతోనే బలమైన ప్రపంచానికి మార్గం సుగమమం అవుతుందని ఆయన అన్నారు. ఆర్ఎంసీ, ఏఏసీ బ్లాక్స్, బ్రిక్ జాయింట్ మోర్టార్ తదితర ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు వర్మ స్టీల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీపీ వర్మ తెలిపారు.

'అంగడి' పోలీస్ సబ్సిడీ క్యాంటీన్ ప్రారంభం



అంగడి ప్రారంభకార్యక్రమంలో డాక్టర్ జితేందర్, స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: 'అంగడి' పోలీసు క్యాంటిన్ ఒక మినీ సూపర్ మార్కెట్ అని తెలంగాణ రాష్ట్ర హోంశాఖా ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో పునరుద్ధరించిన 'అంగడి' పోలీస్ సబ్సిడీ క్యాంటిన్‌ను శనివారం ఆయన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, సాయింట్ సీపీ అవినాష్ మహంతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పోలీసుల సౌకర్యార్థం అంగడి పోలీసు సబ్సిడీ క్యాంటిన్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలీసు సిబ్బంది కుటుంబ అవసరాల నిమిత్తం నిత్యావసరవస్తువులు, ఆహారపదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటివి 25 నుంచి 30 శాతం మేర సబ్సిడీకి లభిస్తాయన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీలు కల్మేశ్వర్, యోగేష్ గౌతమ్ పాల్గొన్నారు.

క్రీడలతో నూతనోత్సాహం

- తెలంగాణ రాష్ట్ర హోంశాఖా ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్

రాయదుర్గం: క్రీడలతో నూతనోత్సాహం వెల్లివిరుస్తుందని తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం సైబరాబాద్ అయిదవ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2023 ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం ఎంతో ముఖ్యమన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనూ, ఏ వృత్తిలోనైనా ఫలితం ఉంటుందన్నారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ క్రీడలు నాయకత్వ లక్షణాలను తట్టిలేపడంలోపాటు టీమ్ స్పిరిట్ ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ అవినాష్‌మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్, పలువురు డీసీపీ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర హోంశాఖా ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్